ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

3

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 7 సెప్టెంబరు 2024



యోగా ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో యోగా డిప్లమో కోర్సు (6 నెలల వ్యవధి)లో ప్రవేశానికి ఈ నెల 15 వరకు దరఖాస్తు గడువు పెంచినట్టు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు ఫీజు రూ.5వేలు కాగా, వర్సిటీలో ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజులో 30శాతం రాయితీ ఉంటుందన్నారు. వర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొంది, రిజిస్ట్రార్ పేరిట రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించిన ఫీజు రశీదు, పదోతరగతి, ఇంటర్ అర్హత సర్టిఫికెట్లు, కుల, ఆధార్ ధ్రువీకరణ జెరాక్స్ కాపీను జతచేసి వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.





విగ్రహాలు తయారుచేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య'కు విశేష స్పందన
- విభిన్నంగా వినాయక విగ్రహాల రూపకల్పన

ఆకట్టుకున్న ఆదిదేవుడు



విజేతలతో స్పాన్సర్లు, 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్



విగ్రహాలు రూపొందిస్తున్న శిల్పి సూర్యతేజ

(అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్)

వినాయక చవితిని పురస్కరించుకుని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శనివారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. సృజనాత్మకతతో తమ ప్రతిభను చూపి.. విభిన్నంగా వినాయక విగ్రహాలను తీర్చిదిద్దారు. ఆదిదేవుడు.. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడ్ని వివిధ రూపాల్లో తయారుచేశారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ.. మట్టితో అందమైన విగ్రహాలను రూపొందించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

వివరాలు- 6లో

- జిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
- అకౌంట్ హ్యాక్‌చేస్తున్న నేరగాళ్లు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

సైబర్ వల!



ఘటనలెన్నో..

- పలాసకు చెందిన ఒక ఉపాధ్యాయుడికి గురుపూజోత్సవం రోజు (శుక్రవారం) ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'మీ కుమారుడు డ్రగ్స్‌తో పట్టుబడ్డాడని, ఆయన్ను విడిపించాలంటే డబ్బులు మా బ్యాంకు ఖాతాలో జమ చేయాల'ని హిందీలో మాట్లాడాడు. ఆ ఉపాధ్యాయుడు ఆందోళన చెంది.. విడతలవారీగా రూ.1.90లక్షలు అపరిచిత వ్యక్తి చెప్పిన బ్యాంకు ఖాతాలో జమచేశారు. ఈ విషయంపై మరో ఉపాధ్యాయుడు జోక్యం చేసుకుని ప్రశ్నించగా.. ఆ వ్యక్తి నుంచి సమాధానం కరువైంది. తర్వాత కుమారుడికి ఫోన్ చేయగా క్షేమంగానే ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో తాను సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయానని ఆ ఉపాధ్యాయుడు గ్రహించారు. దీనిపై కాశీబుగ్గ, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- రణస్థలానికి చెందిన కనక అనే వ్యక్తి ఎక్సైడ్ బ్యాటరీల షాపు నిర్వహిస్తున్నాడు. గత నెల 10న ఓ లారీడ్రైవర్ నుంచి ఫోన్ వచ్చింది. రెండు బ్యాటరీలు పంపించాలని.. ఆ మొత్తాన్ని ఫోన్‌పే చేస్తానని చెప్పారు. కేవలం రూపాయి ఫోన్ పే చేశాడు. రూ.50వేలు పంపించినట్టు స్క్రీన్ షాట్ తీసి వాట్సాప్‌నకు పంపించాడు. బ్యాటరీలకు డబ్బులు పోను మిగతా మొత్తాన్ని పక్కనే బంక్ దగ్గర ఉన్న వ్యక్తికి ఇవ్వాలని సూచించాడు. తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఇది మోసమని గుర్తించి ఆ షాపు యాజమాని వెంటనే పోలీసులను ఆశ్రయించాడు.

- రణస్థలానికి చెందిన ఓ యువకుడికి కొత్త నంబరు నుంచి ఫోన్ కాల్ వచ్చింది. 'మీకు లాటరీ తగిలింది. కొంత మొత్తం చెల్లిస్తే.. ఆ డబ్బులను పంపిస్తాం. మీ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు తెలపండి' అని అవతల వ్యక్తి సూచించాడు. ఆశ పడిన సదరు యువకుడు వివరాలన్నీ చెప్పేశాడు. క్షణాల వ్యవధిలోనే ఆయన ఖాతా నుంచి సుమారు రూ.లక్ష నగదు మాయమైంది.

- జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయుడికి ఇటీవల అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తాను తెలంగాణా నుంచి మాట్లాడుతున్నానని అంటూ.. మీ ఆధార్ నంబర్‌తో డబ్బులు అప్పుగా తీసుకున్నారని.. తక్షణం వాటిని చెల్లించకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. అయితే తాను ఎవరి వద్ద అప్పుతీసుకోలేదని.. నేనే పోలీసులను ఆశ్రయిస్తానని చెప్పడంతో సదరు వ్యక్తి ఫోన్.. స్విచ్ఛాఫ్ చేశాడు.

(రణస్థలం)

జిల్లాలో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సైబర్ నేరగాళ్లకు ఏమాత్రం అవకాశం దొరికినా ఖాతాలను ఖాళీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇందులో సామాన్యులే ఎక్కువగా బాధితులుగా మిగులుతున్నారు. ఇటీవల స్మార్ట్‌ఫోన్ల వినియోగం అధికమైంది. వీటిని ఆసరాగా చేసుకొని నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆన్‌లైన్ లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. నగదును ఆశచూపి వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా యువతకు ఎరవేసి అప్పులు ఇస్తామని ట్రాప్ చేస్తున్నారు. వివరాలను తీసుకొని అడిగినంత సొమ్ము చెల్లిస్తున్నారు. తిరిగి వసూలు చేసే క్రమంలో అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అయితే వివాదం ఎందుకని కొందరు సైలెంట్ అవుతూ..వారు అడిగినంత చెల్లిస్తున్నారు.

● ఫేస్ బుక్ అకౌంట్స్ హ్యాక్..

జిల్లాలో చాలామంది ఫేస్‌బుక్ ఖాతాలు హ్యాక్ అవుతున్నాయి. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేని వారిపైనే సైబర్ నేరగాళ్లు గురిపెడుతున్నారు. వారి ఖాతాలను హ్యాక్ చేసి.. స్నేహితులకు మేసేజ్ పంపిస్తున్నారు. మరికొన్ని నకిలీ ఖాతాలు సృష్టించి.. సేమ్ ప్రొఫైల్ ఫొటో, పేరుతో ఫ్రెండ్స్ రిక్వెస్ట్ పంపుతున్నారు. రిప్లై ఇచ్చిన వారితో చాటింగ్ కొనసాగిస్తూ.. తాను ఆస్పత్రుల్లో ఉన్నానని.. డబ్బులు అత్యవసరమని చెబుతున్నారు. ఇది నిజమేనని నమ్మి.. అవతలి వ్యక్తులు డబ్బులు జమ చేస్తున్నారు. తర్వాత తాము మోసపోయామని గుర్తించినా.. ఏమి చేయలేక నిస్సహాయంగా ఉండిపోతున్నారు. ఈక్రమంలో కొందరు.. 'నా ఫేస్‌బుక్ హ్యాక్ అయ్యింది. నా పేరిట ఎవరో నగదు అడుగుతున్నారు. దయచేసి ఎవరూ నగదు పంపించకండి' అంటూ వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు పంపడం పరిపాటిగా మారింది.

● వీటి జోలికి పోవద్దు..

'మీ కేవైసీ అప్‌డేట్ చేయాలని.. ఫలానా యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని లింక్ వస్తే అస్సలు క్లిక్ చేయకూడదు. ఇలా క్లిక్ చేసిన నిమిషాల వ్యవధిలోనే మీ బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. ఆన్‌లైన్‌లో వెంటనే అప్పులిస్తామన్న యాప్‌లకు దూరంగా ఉండండి. ఒక వేళ రుణం తీసుకున్నా.. తరువాత సమస్యలు వెంటాడే అవకాశం ఉంది. మీకు లాటరీ వచ్చింది. కొంత మొత్తం నగదు చెల్లించాలంటే అస్సలు నమ్మకండి. మైక్రోఫైనాన్స్, ఆన్‌లైన్ రుణ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోకండి. ఆన్‌లైన్ వస్తువుల కొనుగోలులో నమ్మకమైన యాప్‌లనే ఆశ్రయించండి' అని నిపుణులు సూచిస్తున్నారు.

● అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రతీ మెసేజ్ క్షుణ్ణంగా చదవాలి. అవతలి వ్యక్తి సమాచారాన్ని పూర్తిగా తెలుసుకొని స్పందించాలి. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయం. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. మోసాలు నియంత్రించడానికి చర్యలు చేపడుతున్నాం.

-కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

బొరివంకలో ముగ్ధ గణపతి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కవిటి మండలం బొరివంకలో ఉద్దానం యూత్ క్లబ్ సభ్యులు.. పెసర మొక్కలతో ముగ్ధ గణపతి విగ్రహాన్ని రూపొందించారు. క్లబ్ సభ్యుడు బైరి తిరుపతి 2012 నుంచి ఏటా వినూత్నరీతిలో పర్యావరణ హితమైన విగ్రహాలు తయారు చేస్తున్నారు. కొబ్బరికాయలు, వనమూలికలు, కొబ్బరిపువ్వులు, వరి, గోధుమనారు, పసుపు కొమ్ములు, ఆవాలు, పామాయిల్, నలుగు, నల్లజీడి పిక్కలు వంటి ప్రకృతి సిద్ధమైన సహజవనరులతో ఏటా వినాయక విగ్రహాలను రూపొందిస్తున్నారు. గతంలో పలు అవార్డులతోపాటు లిమ్కాబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులోనూ గుర్తింపు పొందారు.

- కవిటి



గణనాథుడి పూజకు వేళాయే

- నేడు వినాయక చవితి
- ముస్తాబైన మండపాలు
- కిటకిటలాడిన మార్కెట్లు

(శ్రీకాకుళం కల్చరల్)



గణనాథుడు కొలువుదీరనున్న వేళ.. ఊరూవాడా సందడి నెలకొంది. శనివారం వినాయక చవితి సందర్భంగా మండపాలు ముస్తాబయ్యాయి. జిల్లాలో ఎక్కడ చూసినా పోటాపోటీగా మండపాలను అలంకరించారు. పూజాసామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. శ్రీకాకుళంలోని పెద్దమార్కెట్, రైతుబజార్, న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో రద్దీ కనిపించింది. పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట తదితర పట్టణాల్లో మార్కెట్ కిక్కిరిసిపోయింది. పండ్లు, పూల ధరకు డిమాండ్ పెరిగింది. ఆపిల్, దానిమ్మ, ద్రాక్ష పండ్లు కిలో రూ.250కుపైగా పలికింది. చామంతి పూలు 100 గ్రాములు రూ.120కి విక్రయించారు. గులాబీ, బంతిపూల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి. మరోవైపు వినాయక ప్రతిమలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ధరలు చూసి ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఏదిఏమైనా తమ విఘ్నాలు తొలగించాలని కోరుతూ.. వినాయకుడి పూజకు సిద్ధమయ్యారు.



శ్రీకాకుళం పెద్దమార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ

భావనపాడుపై పర్యాటకశాఖ దృష్టి

- ఐదు ఎకరాల్లో రిసార్ట్స్, బీచ్‌డెవలప్‌మెంట్‌కు చర్యలు
- మంత్రి అచ్చెన్న ఆదేశాలతో స్థల సేకరణకు కసరత్తు

(టెక్కలి)

భావనపాడు తీరప్రాంతంపై పర్యాటక శాఖ దృష్టి సారించింది. ఈ ప్రాంతంలో బీచ్ డెవలప్‌మెంట్, రిసార్ట్స్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపడుతోంది. మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు పర్యాటక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటి ఏర్పాటుకు ఐదు ఎకరాలు స్థలం అవసరమని రెవెన్యూ శాఖ అధికారులను కోరినట్టు తెలిసింది. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇటీవల టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి లేఖ కూడా పంపారు. భావనపాడు సమీపంలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో మినీ ఎయిర్‌పోర్టు, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్, బీపీసీఎల్ రిఫనరీ, కోస్టల్ కారిడార్ రహదారుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో పారిశ్రామికవాడకు అవసరమైన భూసేకరణకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా పర్యాటకశాఖ అధికారి నారాయణ రావు వద్ద ప్రస్తావించగా భావనపాడులో ఐదు ఎకరాల స్థలం అవసరమని రెవెన్యూ అధికారులను కోరినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం పర్యాటక మణిహారం కానుందని వెల్లడించారు.



భావనపాడు తీరప్రాంతం

రేషన్ బియ్యం పక్కదారి

- మిల్లులకు తరలింపు
- ఆపై బ్రాండెడ్ బియ్యంలో కలిపి విక్రయాలు

(ఇచ్ఛాపురం)

రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒకచోట అక్రమంగా రవాణా చేస్తున్న బియ్యం అధికారుల తనిఖీల్లో పట్టుబడుతూనే ఉన్నాయి. బియ్యం అక్రమ రవాణాలో కొందరు మిల్లర్లే క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్థాయి నుంచి మాఫియా కోరలు చాస్తోంది. చిరు వ్యాపారులను భాగస్వామ్యం చేసుకొని రేషన్ బియ్యం వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. రేషన్ బియ్యాన్ని రైతు కుటుంబాలతోపాటు ఎగువ మధ్యతరగతి వారు ఎక్కువగా విక్రయిస్తుంటారు. గతంలో నేరుగా లబ్ధిదారుల నుంచి డీలర్లే కొనుగోలు చేసేవారు. ఇప్పుడు చిరు వ్యాపారులు సైతం ఇదో వృత్తిగా పెట్టుకున్నారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ కిలో బియ్యాన్ని రూ.15 నుంచి రూ.20 వరకూ కొనుగోలు చేస్తున్నారు. వాటినే మిల్లర్లకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. మిల్లర్లు ఇచ్చిన సొమ్ముతోనే ఇక్కడ చిరువ్యాపారులు బియ్యం కొనుగోలు చేస్తుంటారు. కిలో దగ్గర రూ.5 నుంచి రూ.10 వరకూ కమీషన్ తీసుకుంటారు. ఇదే బియ్యాన్ని మిల్లర్లు లెవీకి చూపించి సొమ్ము చేసుకుంటున్నారు.

● వాటినే లెవీగా చూపుతూ..

సాధారణంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తుంది. వారు ఏడాది పొడవునా మిల్లింగ్ చేసి పౌరసరఫరాల శాఖకు అప్పగించాలి. ఇందుకుగాను క్వింటా మిల్లింగ్ చేసేందుకు ప్రభుత్వం రూ.60 చెల్లిస్తుంది. అయితే ఇక్కడే కొందరు మిల్లర్లు దగా చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని నేరుగా లెవీగా చూపుతున్నారు. చిరు వ్యాపారుల ద్వారా కొనుగోలు చేయించిన బియ్యాన్నే మిల్లింగ్ చేసిన బియ్యంగా చూపుతున్నారు. రూ.25 నుంచి రూ.30 వరకూ రేషన్ బియ్యాన్ని చూపి లెవీకి పంపుతున్నారు. బస్తా దగ్గర రూ.30 వరకూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

● బ్రాండెడ్ బియ్యంగా మార్చి

రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సన్నబియ్యంగా కొందరు మిల్లర్లు చూపుతున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసే రేషన్ బియ్యాన్ని సాంబమసూరి వంటి బ్రాండెడ్ బియ్యంలో కలిపి విక్రయిస్తున్నారు. సన్నంగా మరపట్టడంతో వినియోగదారులు సైతం గుర్తించలేక మోసపోతున్నారు. తూకం దగ్గర సైతం ఇదే పరిస్థితి. 25 కిలోలు ఉండే ప్యాకెట్‌లో ఉండేది 23 కిలోలే. రెండు కిలోలు తరుగును చూపిస్తుంటారు. ఇటు బియ్యం నకిలీతో పాటు తూకంలో సైతం వినియోగదారుడు నష్టపోవాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు కానీ.. తూనికలు కొలతలు శాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఉందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.



ఇచ్ఛాపురంలో రాత్రివేళ.. రేషన్ బియ్యం తరలింపు

శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో ప్రత్యేక రైళ్లకు హాల్ట్

విశాఖపట్నం, సెప్టెంబరు 6: ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, తంబరం-సంత్రాగచ్చి మధ్య ప్రవేశపెడుతున్న ప్రత్యేక రైళ్లకు శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) స్టేషన్‌లో రెండు నిమిషాలపాటు హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి రైలు(06089) ఉదయం 5.00 గంటలకు, తిరుగు ప్రయాణంలో సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్ రైలు(06090) మధ్యాహ్నం 2.05 గంటలకు, తంబరం-సంత్రాగచ్చి రైలు (06095) ఉదయం 5.00 గంటలకు, తిరుగు ప్రయాణంలో సంత్రాగచ్చి-తంబరం రైలు మధ్యాహ్నం 2.05 గంటలకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌కు చేరుతాయని పేర్కొన్నారు. దువ్వాడ మీదుగా హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను యశ్వంతపూర్ వరకు పొడిగించామన్నారు. ఈ నెల 25నుంచి సత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా హౌరా-యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ (22831/22832) సర్వీసులుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.




హీరోగా ఎంట్రీ

టాలీవుడ్ అగ్రకథానాయకుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులకు శుభవార్త. ఆయన తనయుడు మోక్షజ్ఞ సినీ అరంగేట్రం ఖరారైంది. శుక్రవారం మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా ఈ విషయాన్ని ప్రకటించారు. 'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలకృష్ణ తనయ ఎం తేజస్విని నందమూరి సమర్పణలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మోక్షజ్ఞ స్టైలిష్ లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'మోక్షజ్ఞను పరిచయం చేయడం గొప్ప గౌరవం. అలాగే పెద్ద బాధ్యత కూడా. బాలకృష్ణ గారు కథపై, నాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. మన ఇతిహాసాల నుంచి స్ఫూర్తి పొందిన కథతో తెరకెక్కిస్తున్నాం. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌ను మరో స్థాయికి తీసుకెళుతుంది' అన్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ 'మోక్షజ్ఞ సినిమాను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. ఆయన అరంగేట్రానికి సరిపోయే కథతో అద్భుతమైన స్క్రిప్ట్‌తో ప్రశాంత్ వర్మ ముందుకు వచ్చారు. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తాం' అన్నారు. ప్రేక్షకులను అలరించేందుకు మోక్షజ్ఞ డాన్స్, ఫైట్స్‌లో కఠోర శిక్షణ పొందారు. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ సోషల్‌మీడియా ద్వారా మోక్షజ్ఞకు అభినందనలు తెలిపారు.

'గేయ కిరీటి' వడ్డేపల్లి కృష్ణ ఇకలేరు

- లలితగీతాల రచయితగా ఖ్యాతి
- సినిమా పాటలతోనూ పేరు
- ఉమ్మడి ఏపీ సెన్సార్ బోర్డు సభ్యుడిగా, నంది అవార్డు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు
- ఆదివారం అంత్యక్రియలు

ప్రముఖ లలితగీతాల రచయిత, సినిమా పాటల కవి, 'గేయ కిరీటి' బిరుదాంకితుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ (76) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. వడ్డేపల్లి కృష్ణ స్వస్థలం సిరిసిల్ల. వెయ్యికి పైగా గేయాలు రాసిన వడ్డేపల్లిని వేములవాడ రాజరాజేశ్వరీ ఆలయ నిర్వాహకులు 'గేయ కిరీటి' బిరుదుతో సత్కరించారు. నిరుపేద చేనేత కుటుంబంలో పుట్టిన ఆయన సినారె స్ఫూర్తితో విద్యార్థి దశలోనే గేయ రచన ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి 'లలిత గీతాల' మీద ఆయన చేసిన పీహెచ్‌డీ పరిశోధన అత్యంత ప్రామాణికమైనదిగా విమర్శకులు చెబుతారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన "పిల్ల జమిందార్" సినిమాలో 'నీచూపులోన విరజాజి వాన...' పాటతో సినీగేయ రచయితగా ఆయన ప్రస్థానం ప్రారంభించారు. "పెద్దరికం" సినిమాలో 'ముద్దుల జానకి పెళ్లికి మబ్బుల పల్లకి తేవలెనే', "భైరవద్వీపం" - 'అంబా శాంభవి...', "పిలిస్తే పలుకుతా" - 'సమతా మమతల సాకారం... పిలిచిన పలికే ఓంకారం' తదితర గీతాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. వడ్డేపల్లి కలం నుంచి జాలువారిన దేశభక్తి గీతాలెన్నో ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. మరికొన్ని 60 ఆడియో ఆల్బమ్స్‌గానూ వచ్చాయి. ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటాన్ని కళ్ళకు కట్టే 'జయజయహే తెలంగాణ', 'ఆమ్రపాలి', 'రమణీయ రామప్ప' తదితర నలభైకు పైగా సంగీత, నృత్యరూపకాలను రచించారు.



'బలగం' సినిమా నటుడిగా...

వడ్డేపల్లి రాసిన గేయం పూజె బాలభారతి తెలుగు వాచకాల్లో పాఠ్యాంశంగా చేర్చారు. సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు, బతుకమ్మ, గోభాగ్యం తదితర అంశాలపై డాక్యుమెంటరీలు రూపొందించారు. 'లావణ్య విత్ లవ్ బాయ్స్', 'ఎక్కడికెళ్తుందో మనసు' సినిమాలకు, 'భక్త పోతన' వంటి టెలివిజన్ ధారావాహికలకు దర్శకత్వం వహించారు. 'బలగం' సినిమాలో నటించారు. తెలుగు సినీ రచయితల సంఘం త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా వారం కిందట వడ్డేపల్లి కృష్ణను జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఉమ్మడి ఏపీలో నంది అవార్డుల కమిటీ చైర్మన్‌గా, సెన్సార్ బోర్డు సభ్యుడిగా, అంతర్జాతీయ బాలల చిత్రోత్సవం, బాలల నంది నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఆదివారం మధ్యాహ్నం వడ్డేపల్లి కృష్ణ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన అల్లుడు పత్తిపాక ఈశ్వర్ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా



'హుషారు' చిత్రంతో అందరినీ అలరించిన నటుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా' శనివారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజస్ మీడియాతో మాట్లాడుతూ "హుషారు' తర్వాత చాలా కథలు విన్నాను. ఏదైనా కొత్త ఉంటే సినిమా చేద్దామనుకుంటున్న నాకు దర్శకుడు వివేక్ చెప్పిన పాయింట్ బాగా నచ్చింది. ఆ తర్వాత ఇద్దరం కలసి కథ తయారు చేశాం. స్క్రిప్ట్ బాగా వచ్చింది. చాలా మంది నిర్మాతలను కలసి కథ వినిపించాం. అందరూ బాగుందని అన్నారు కానీ నా మీద అంత బడ్జెట్ పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరకు మా నాన్న (కంచర్ల బాలభాను) ఈ కథ విన్నారు. ఆయనకు నచ్చడంతో సినిమా తీయడానికి ముందుకు వచ్చారు" అని చెప్పారు. 'తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ కథ ఉంటుంది. అయినా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. లాక్ డౌన్‌లో మూఢ నమ్మకాల గురించి వార్తలు ఎక్కువగా చదివాను. అలాంటి కొన్ని సంఘటనల చుట్టూ కథ అల్లాను. థ్రిల్లర్, కామెడీ జానర్‌లో వినోదభరితంగా ఉంటుంది.' అని చెప్పారు తేజస్. దర్శకత్వం చేయాలనే కోరిక ఉందనీ, అలాగే పాత్ర నచ్చితే స్పెషల్ రోల్స్ కూడా చేస్తానని తెలిపారు.













మట్టి వినాయకుని పూజిద్దాం


పోలాకి: వినాయక ప్రతిమలు, వ్రతకల్పం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


మెళియాపుట్టి: జనసేన నాయకుల ఆధ్వర్యంలో


పాతపట్నం: మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

మట్టి వినాయకుని పూజిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.
-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


టెక్కలి: చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో


ఎల్ఎన్‌పేట: మట్టి ప్రతిమల పంపిణీ


జలుమూరు: సాయి భక్తుల ఆధ్వర్యంలో..


హిరమండలంలో పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


కొత్తూరు: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం


మందస: మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణీ దృశ్యం


కోటబొమ్మాళిలో విగ్రహాలతో ఉపాధ్యాయులు


సంతబొమ్మాళి: దండుగోపాలపురం హైస్కూల్‌లో విగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థులు

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



ఎమ్మెల్యే శిరీషకు విగ్రహాలు అందిస్తున్న విద్యార్థులు

పలాస: స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషకు విద్యార్థులు తాము తయారు చేసిన మట్టి వినాయకుడి విగ్రహాలు శుక్రవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో అందించారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ఆర్డీఓ భరత్‌నాయక్‌కు, అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదిరి విలేకర్లతో మాట్లాడుతు పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలు వినియోగించాలని తాము ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

ఆవు పొట్టలో 15 కిలోల వ్యర్థాలు

కోటబొమ్మాళి: నరసన్నపేట మండలం మడపాం గ్రామానికి చెందిన మర్ల గోపాలరావుకు చెందిన ఆవు పొట్టలో సుమారు 15కిలోల వ్యర్థాలు బయట పడ్డాయి. గత 10 రోజుల నుంచి ఆవు పొట్ట ఉబ్బడం, నడవలేకపోవడంతో కోటబొమ్మాళి పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్‌ను గోపాలరావు సంప్రదించారు. ఆయన సూచన మేరకు ఆవును కోటబొమ్మాళి పశువైద్య శాలకు తరలించారు. ఈ మూగజీవికి శస్త్ర చికిత్స చేసి పొట్టలో ఉన్న సుమారు 15 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను బయటకు తీశారు. ప్రస్తుతం ఆ ఆవు ఆరోగ్యం మెరుగుపడిందని పశువైద్యాధికారి తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలకు వినతి

పలాస: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, ఇన్‌చార్జి కమిషనర్ అప్పలరాజుకు బీజేపీ నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఎల్ఐసీ కార్యాలయం వెనుకభాగంలో ఐదంతస్థుల భవనాన్ని అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని తెలిపారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం ఉండాలి

పలాస రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యం పెట్టుకొని.. మంచి ఫలితాలు సాధించాలని అంబేద్కర్ యూనివర్సిటీ పూర్వ వీసీ లజపతిరాయ్ అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతులు నిర్వహించారు.

వారం రోజుల్లో పారిశుధ్యం మెరుగుపడాలి

- ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశం
- ప్రభుత్వ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

పలాస: వారం రోజుల్లో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య సమస్యలు మెరుగు పడాలని, లేకుంటే సంబంధిత కాంట్రాక్టర్‌ను సాగనంపుతామని ఎమ్మెల్యే గౌతు శిరీష హెచ్చరించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. వార్డుల నుంచి పరిసరాల వరకూ పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. పారిశుధ్య కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రూ.లక్షల్లో ప్రభుత్వం ఇస్తోందని... కనీసం పారిశుధ్య సమస్యలు పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. వార్డులో శుభ్రత లేదని, మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కరిస్తామని సంబంధిత కాంట్రాక్టర్ వివరణ ఇచ్చారు. వారం రోజుల్లో మళ్లీ తాను ఆసుపత్రిని సందర్శిస్తానని, పారిశుధ్య సమస్యలు మెరుగుపడకపోతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

సొంత క్లినిక్‌లకు తరలిస్తున్నారా?

ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులను ఇక్కడి వైద్యులు సొంత క్లినిక్‌లకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే శిరీష కోరారు. దీనిపై వైద్యులు టి.పాపినాయుడు, చిన్నంనాయుడు, రఘురామ్, సుశీల, అశ్విని మాట్లాడుతూ రోగులకు ఆసుపత్రిలోనే వైద్యం అందిస్తున్నామని చెబుతూ సంబంధిత రికార్డులను చూపించారు. కొంతమంది వైద్యాధికారులను ఇబ్బందులు పెడుతున్నారని సూపరింటెండెంట్ టి.పాపినాయుడును ప్రశ్నించగా.. ఇక్కడ అంతా సమానమేనని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవచ్చని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వార్డుల్లో తిరుగుతూ రోగులకు కల్పిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ఎం.నరేంద్ర(చిన్ని), లొడగల కామేశ్వరావు యాదవ్, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.


వైద్యాధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

హరిపురం: కళాశాల విద్యార్థులు, మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఖాదర్‌బాషా హెచ్చరించారు. మందస మండలం హరిపురంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. అనంతరం వారికి అవగాహన కార్యక్రమం చేపట్టారు. మైనర్లు వాహనాలు నడిపితే కలిగే నష్టాలను, జరుగుతున్న ప్రమాదాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, యువత పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి హుండీ లెక్కింపు

కోటబొమ్మాళి: స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గల హుండీల ద్వారా 95 రోజులకు గాను రూ.5.66.892 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జీవీబీఎస్ రవికుమార్, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సులను రెగ్యులర్ చేయాలి

నరసన్నపేట: తమను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరుతూ స్థానిక సామాజిక ఆసుపత్రి వద్ద శుక్రవారం నర్సులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమ పోస్టులను క్రమబద్ధీకరించి జీవో నెంబరు 5ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఉమ, ఎస్.భవానీ, సీహెచ్.సుజాత, ఎం.పవిత్ర, రాజేశ్వరి, వరలక్ష్మి, రమణమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: గత 13 సంవత్సరాలుగా స్టాఫ్‌నర్సులుగా విధులు నిర్వహిస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో శుక్రవారం కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు నిరసన తెలిపారు. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సేవలు అందించామని తెలిపారు. తమ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లామని, స్పందన రాకపోవడంతో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు.

టిక్కెట్ ధరల పట్టికలు ఏవీ?: ఆర్డీవో

పలాస: సినిమా థియేటర్ల వద్ద టిక్కెట్ ధరల పట్టికలు సక్రమంగా లేవని పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన రెవెన్యూ అధికారులతో కలసి పలాస-కాశీబుగ్గ థియేటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా థియేటర్ల ఎదుట పాత ధరల పట్టికలు ఉండడం చూసి సంబంధిత యజమాన్యాన్ని పిలిచి... ఇది సరైంది కాదని, తక్షణం కొత్త బోర్డులు పెట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన థియేటర్లతో కల్పిస్తున్న పార్కింగ్, తినుబండారాల స్టాల్స్ మరుగుదొడ్లు, థియేటర్లలో సీట్లను పరిశీలించారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉండడంతో పాటు ప్రేక్షకులకు సరిపడిన విధంగా లేకపోవడాన్ని గుర్తించారు. పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లో షెడ్లు లేని విషయాన్ని గుర్తించి యాజమాన్యాలకు ఆదేశాలు ఇచ్చారు. థియేటర్లలో సౌకర్యాలపై కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీఓ తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు బి.సత్యం, సిబ్బంది ఉన్నారు.

వినాయక మండపాల వివరాలు ఉండాలి

ఆర్డీవో సుదర్శన దొర

టెక్కలి: వినాయక ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వివరాలు అధికారుల వద్ద పక్కాగా ఉండాలని ఆర్డీవో బి.సుదర్శన్‌దొర అన్నారు. శుక్రవారం రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్, ఫైర్, పంచాయతీ తదితర శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. ఉత్సవ విగ్రహాల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లు ఉపయోగించరాదని, భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. బలవంతపు చందాలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపీడీవో లక్ష్మీబాయి, ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, ట్రాన్స్‌కో ఏఈ భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పీకేఎస్ మహాసభలు విజయవంతం చేయండి

కాశీబుగ్గ: ప్రగతిశీల కార్మిక సమాఖ్య(పీకేఎస్) శ్రీకాకుళం జిల్లా రెండో మహాసభలు విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కాశీబుగ్గలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 8, 9లలో బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో జరిగే మహసభలు విజయవంతం చేయాలని కోరారు.

సదుపాయాలతోనే అభివృద్ధి

సవరకొత్తబాలేరు (ఎల్.ఎన్.పేట): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాదరావు తెలిపారు. సవరకొత్తబాలేరు గ్రామంలో ప్రధానమంత్రి జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ అధికారి ఐ.పద్మజ, ఏపీఎం రవిరాజ్ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

మెళియాపుట్టి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలపై అవగాహన అవసరమని ఎంపీడీఓ చంద్రకుమారి తెలిపారు. శుక్రవారం వెంకటాపురం పంచాయతీలో పీఎం జన్‌మాన్ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ తిరుపతి పట్నాయక్, కార్యదర్శి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

హిరమండలం: హిరమండంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటలకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో వినాయక చవితి ఉత్సవాలకు మండపాలు ఏర్పాటు చేసుకున్న వారితో పాటు పూజా సామగ్రి అమ్మేవారు, కొను గోలుదారులు ఇబ్బంది పడ్డారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హిరమండలం: గిరిజన గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు అన్నారు. శుక్రవారం పెద్దగూడ పంచాయతీని ఆయన సందర్శించారు. అక్కడి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేదని స్థానికులు చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు బాగు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దంత తేజ, ఎస్.శైలేష్, ఎస్.బుడ్డయ్య పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి

● వీరిలో జిల్లా వాసి ఒకరు.. రాజమండ్రిలో ఘటన


ప్రవీణ్ (ఫైల్)

దివాన్‌చెరువు/ పలాస, సెప్టెంబరు 6: జాతీయరహదారిపై తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు (రాజమండ్రి) వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో పల్నాడు జిల్లా సీవల్లిపురం గ్రామానికి చెందిన చింతా కార్తీక్(19), శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రోణంకి ప్రవీణ్(21) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరిద్దరూ ఇక్కడకు సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి బొమ్మూరు ఎస్‌ఐ అంకారావు శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. వీరు బ్రిడ్జి కౌంటీలోని ఒక రూమ్‌లో ఉంటున్నారు. ప్రవీణ్‌కు ఒంట్లో బాగోకపోవడంతో ఇద్దరు గురువారం రాత్రి స్కూటీపై ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో దివాన్‌చెరువు పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా వీరిని ఢీకొని కొద్ది దూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఇద్దరి శరీరభాగాలు తెగి రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ఆప్రాంతమంతా రక్తసిక్తమైంది. సమాచారం అందుకున్న వెంటనే బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకోగా.. డ్రైవరు పరారీలో ఉన్నాడన్నారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నట్టు ఎస్‌ఐ అంకారావు తెలిపారు. శవపరీక్ష అనంతరం విద్యార్థుల భౌతికకాయాలు తీసుకువెళ్తున్న అంబులెన్స్‌లను వారు చదువుతున్న కళాశాల ప్రధానద్వారం వద్దకు తీసుకు వచ్చి కొద్దిసేపు ఉంచారు. నిన్నటి వరకూ తమతో కలసి ఉన్న విద్యార్థులు రోడ్‌ప్రమాదానికి గురై తిరిగి రానిలోకాలకు చేరుకోవడంతో సహచరవిద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు. కాగా పలాస పట్టణ పరిధి ఉల్లాసపేట గ్రామానికి చెందిన ప్రవీణ్‌కు తల్లిదండ్రులు త్రోహిదాస్, సరస్వతి, అక్క చరిష్మా ఉన్నారు. త్రోహిదాస్ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


సుజాత(ఫైల్)

ఇచ్ఛాపురం: ధర్మపురం గ్రామానికి చెందిన వివాహిత రంగాల సుజాత(22) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టి.బరంపురం పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన సుజాతకు ధర్మపురం గ్రామానికి చెందిన నూకరాజుతో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. నూకరాజు వలస కూలీగా విదేశాలకు వెళ్లి వస్తుంటాడు. మూడు రోజుల కిందట భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గొడవ పడ్డారు. దీంతో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె బాడీలోషన్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించగా, మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించి తహసీల్దార్ సమక్షంలో శవపంచనామా చేశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చెరువులో పడి యువకుడు మృతి


రాజు(ఫైల్)

నందిగాం/బూర్జ: నందిగాం పరిధిలోని ఎదురుబంద చెరువులో పడి బూర్జ మండలం అప్పన పట్నాయకునిపేట (ఏపీ పేట) గ్రామానికి చెందిన గిరడ చిన్నమనాయుడు అలియాస్ రాజు(35) మృతిచెందాడు. పోలీసులు, రాజు తల్లి పార్వతి తెలిపిన వివరాల మేరకు.. రాజు బూర్జ మండలంలోని కొల్లివలసలో గల ఓ దాబాలో కుక్‌గా పని చేస్తున్నాడు. వైద్యం నిమిత్తం సోంపేట వెళ్తానని ఈ నెల 4న ఇంటి నుంచి బయలుదేరాడు. ఆ తర్వాత ఏమైందో గాని శుక్రవారం నందిగాం సమీపంలోని ఎదురుబంద చెరువులో విగతజీవిగా తేలాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మహ్మద్ అమీర్ ఆలీ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పార్వతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి ..


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

బూర్జ: కొల్లివలస గ్రామం నుంచి వచ్చినట్టు చెప్పిన గుర్తుతెలియని ఓ వ్యక్తి శుక్రవారం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక తెలిపారు. గత 28న చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రిలో చేరగా, అతడి వివరాలు ఏమీ చెప్పలేదు. తనది కొల్లివలస గ్రామమని మాత్రమే చెప్పినట్టు వైద్య సిబ్బందికి తెలిపారన్నారు. కాగా మృతుడి వివరాలు తెలిసినవారు రిమ్స్ ఆసుపత్రిలో గాని, పోలీసు స్టేషన్‌లో గాని సంప్రదించాలని

సెబీ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

● భర్త వేధింపులు భరించలేకేనని తల్లి ఫిర్యాదు

నరసన్నపేట: భర్త వేధింపులు తాళలేక సెబీ కానిస్టేబుల్ అనూష పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. జగన్నాథపురంలో ఉంటున్న గుర్రాల అన్నపూర్ణ చిన్న కుమార్తె అనూష ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అదే శాఖలో పనిచేస్తున్న రేగిడి ఆమదాలవలసకు చెందిన కుమిలి విజయ్‌కుమార్‌తో 2014లో ఆమెకు వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిత్యం మద్యం తాగుతున్న విజయ్ కుమార్ కొన్నాళ్లుగా తన భార్యను అనుమానించేవాడని, ఈ వేధింపులు భరించలేక మెడికల్ సెలవులపై వచ్చిన అనూష తన దగ్గరే ఉందని తల్లి అన్నపూర్ణ పోలీసులకు తెలిపింది. ఈనెల 5న భర్తతో మాట్లాడిన తరువాత అనూష పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వివరించింది. స్థానికులు ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనూష తల్లి అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. అన్నపూర్ణ స్వగ్రామం హిరమండలం మండలం కిట్టాలపాడు గ్రామం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి: జాతీయ రహదారి జర్జంగి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం సరియాబొడ్డపాడు గ్రామానికి చెందిన సనపల తవిటయ్యతో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సనపల తవిటయ్యతో పాటు మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై కోటబొమ్మాళి నుంచి స్వగ్రామానికి వస్తుండగా.. టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ కారు నిమ్మాడ జంక్షన్ వద్ద తిరిగి పలాస వైపు వస్తుండగా హైవే పెట్రోలింగ్ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మహిళకు..

ఎచ్చెర్ల: చిలకపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం కారు ఢీకొనడంతో ఓ మహిళ గాయపడింది. ఇదే గ్రామానికి చెందిన బొచ్చ సూరప్పమ్మ కూరగాయలు కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఫ్లై ఓవర్ కింద రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు సర్వీసు రోడ్డులో వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమించిన వ్యక్తికి జైలు, జరిమానా

పొందూరు: ఔషధ చట్టం నిబంధనలు అతిక్రమించిన పైడి జగన్నాథం అనే వ్యక్తికి పొందూరు ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయాధికారి ఒక రోజు జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధించినట్టు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. కింతలి గ్రామంలో డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ లావణ్య, అధికారులు మెడికల్ దుకాణంపై 2019లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో శివగణేష్ మెడికల్ స్టోర్‌లో కాలం చెల్లిన మందులు, 19 రకాల ఫిజీషియన్ శాంపిల్స్ ఉన్నట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. దీనిపై నేరం రుజువు కావడంతో యజమాని పైడి జగన్నాథానికి శిక్ష ఖరారు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉత్సాహంగా..

● 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో 'బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య'
● విద్యార్థుల నుంచి విశేష స్పందన
● ఆకట్టుకున్న ఆదిదేవుడి ప్రతిమలు


పరిశీలిస్తున్న డీఈవో తిరుమల చైతన్య

అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 6: హిందువులంతా ఆనందంగా జరుపుకొనే పండగల్లో ప్రథమమైన 'వినాయక చవితి'ని కాలుష్య రహితంగా నిర్వహించుకునేలా అవగాహన కల్పించేందుకు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎప్పటిలానే ఈసారి కూడా శ్రీకారం చుట్టింది. శ్రీకాకుళంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం 'బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య' కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా చేపట్టింది. వందలాది మంది విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని.. తమ చిట్టిచేతులతో స్వయంగా బొజ్జ గణపయ్యలను తయారీ చేసి... ఒకరోజు ముందుగానే పండగ జరుపుకున్నామన్న ఆనందం వారిలో నిండింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కృషిని.. ఈ సందర్భంగా అతిథులు కొనియాడుతూ కాలుష్య రహితంగా పండగలు జరుపుకొనే విధానంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడం అభినందనీయమంటూ వ్యాఖ్యానించారు.

ఉత్సాహంగా పాల్గొన్న వందలాది విద్యార్థులు..

'బుజ్జాయి చేతుల్లో బొజ్జ గణపయ్య' కార్యక్రమంలో నగరంలోని విశాఖ స్కూల్, శ్రీసన్‌షైన్ హైస్కూల్, వికాస్ హైస్కూల్, శ్రీసాయి విద్యామందిర్, న్యూ సెంట్రల్ స్కూల్, టంగుటూరి ప్రకాశం మున్సిపల్ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్(కుప్పిలి) నుంచి వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, జీఎస్ జూయలర్స్ అధినేత గుడ్య శ్యామ్‌కుమార్, ఆంధ్ర జ్యోతి-ఏబీఎన్ మేనేజర్ ఆర్.సోమశంకర్, ప్రధాన స్పాన్సర్ అయిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణారావుతో కలసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. అనంతరం శిక్షకుడు పొట్నూరు సూర్యతేజ మట్టితో వినాయక ప్రతిమ ఎలా తయారీ చేయాలో చేసి చూపించగా.. విద్యార్థులు ఆయన్ని అనుకరిస్తూ బొజ్జ గణపయ్యలను తయారీచేసి మురిసిపోయారు. ఈ కార్యక్రమానికి కోస్పాన్సరర్లుగా రవితేజ డెవలపర్స్ ప్రతినిధి సింహాచలం, డాక్టర్ దానేటి శ్రీధర్ హాస్పిటల్స్, హాస్పిటాలిటీ బీజీఆర్ ఫౌండేషన్ అధినేత చక్రవర్తి, ఆనంద సాయి జూయలర్స్ అధినేత కిల్లాన తిరుమలరావు, వెంకటేశ్వర ఏజెన్సీస్ అధినేత అశోక్, ఆదిత్య మినరల్స్ అధినేత గుప్తాలు వ్యవహరించారు. విజేతలకు స్పాన్సర్ అంబటి కృష్ణారావుతో కలసి ఆంధ్రజ్యోతి మేనేజర్ సోమ శంకర్ బహుమతులను అందజేశారు. అతిథులకు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు


తయారు చేసిన వినాయక విగ్రహాలతో విద్యార్థుల సందడి

విజేతలకు బహుమతులు..

విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను పరిశీలించి ఉత్తమంగా తయారు చేసిన 10 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో ప్రథమ బహుమతి జె.నవ్య (సన్‌షైన్ స్కూల్), ద్వితీయ బహుమతి ఎస్.ప్రవల్లిక (న్యూ సెంట్రల్ స్కూల్), తృతీయ బహుమతి వి.హర్షవర్ధన్ (న్యూ సెంట్రల్ స్కూల్) గెలుచుకున్నారు. వీరికి అతిథులు బహుమతులు అందించి అభినందించారు. అలాగే చక్కగా విగ్రహాలను తయారు చేసిన సాయి లేకహర్షణ్, బి.లోహిత్, ఎ.అలేఖ్య, లీలాప్రసాద్, శశాంక, ఆర్.బాలాజీ, ఎం.దినేష్‌లకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. విద్యార్థులకు సహాయంగా వమరవల్లి ఏపీ రెసిడెన్షియల్ విద్యార్థిని జి.రేణుకాలక్ష్మి సహవ్యాఖ్యాతగా వ్యవహరించింది.

● ప్రథమ బహుమతి విజేత జె.నవ్య మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తొలిసారిగా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. మట్టి విగ్రహాల తయారీ ఆవశ్యకతను ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నాను. అందరికీ పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తెలియజేస్తాను.

● ద్వితీయ బహుమతి విజేత ఎస్.ప్రవళిక మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగించే ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. నా కుటుంబ సభ్యులతో పాటు తోటి విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పిస్తాను.

● తృతీయ బహుమతి విజేత వి.హర్షవర్ధన్ మాట్లాడుతూ.. ఏటా ఆకర్షణీయమైన వినాయక విగ్రహాలను చూస్తుంటాను. కానీ అవి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో, రసాయన రంగులతో తయారు చేస్తారని, అవి హానికరమని ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నారు. స్వంతంగా మట్టి విగ్రహాన్ని తయారు చేసి, అదే విగ్రహానికి ఇంట్లో పూజ చేసుకుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది. ఇక ఎప్పటికీ మట్టి ప్రతిమలనే వినియోగిస్తాను.

అవగాహన మంచిదే..

భూమిపై రోజురోజుకి పెరుగుతున్న పర్యావర ణ కాలుష్యం.. నివారణ చర్యలపై విద్యార్థులు కూడా ఏ రీతిన చర్యలు తీసుకోవచ్చో ఇటువంటి కార్యక్రమాల ద్వారా అవగాహన పెంపొందించడం మంచిదే. మట్టి వినాయక ప్రతిమల తయారీ వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థుల ద్వారానే ఇతరులకు వివరించవచ్చు.

- తిరుమల చైతన్య, డీఈవో

స్ఫూర్తిదాయకం..

నేటి తరానికి మట్టి వినాయక ప్రతిమల వినియోగంపై అవగాహన కల్పించడం స్ఫూర్తి దాయకం. ఇందులో నన్ను కూడా భాగస్వామిని చేయడం ఆనందంగా ఉంది. విద్యార్థులతో మట్టి బొమ్మలు తయారు చేయించి ముందే పండగ జరుపుకొనేలా చేయడం హర్షణీయం.

- అంబటి కృష్ణారావు, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (స్పాన్సర్)

సృజనాత్మకతను వెలికి తీసేందుకే..

మన సంస్కృతి సంప్రదాయాలను అనుసరించేందుకు, మట్టి విగ్రహాల తయారీతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడేలా వారిని తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నాం. ముందే పండగ వచ్చిందన్న రీతిలో విద్యార్థులలో ఆనందం కనిపించింది. విద్యార్థులు పర్యావరణంపై మక్కువ పెంచుకుంటూ పండగలు నిర్వహించుకోవాలన్నదే మా లక్ష్యం.

- ఆర్.సోమశంకర్, ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ మేనేజర్

మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి/ శ్రీకాకుళం కల్చరల్: మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగ పురస్కరించుకుని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 30వేల మట్టి వినాయక ప్రతిమలు, పూజా పుస్తకంతో కలిపి పంపిణీ కార్యక్రమాన్ని నగరంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద కేంద్రమంత్రి ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల ను వినియోగించడ వల్ల నీరు, వాతావరణం కలుషితమై అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలతోపాటు, వివిధ పాఠశాలల్లో, స్వచ్ఛంద సంస్థల ద్వారా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్


రణస్థలంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్..


కంచిలి: మట్టి విగ్రహాల పంపిణీలో ఎమ్మెల్యే అశోక్


జి.సిగడాం: నక్కపేట పాఠశాలలో..


గార: మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


లావేరు: బుడుమూరు పాఠశాలలో..

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. నగర పరిధి శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని క్రీడంశాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఉన్నారని, వారందరికీ తర్ఫీదు పొందేందుకు కోడిరామ్మూర్తి స్టేడియం త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్టు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, నారాయణశెట్టి వెంకట కిరణ్ కుమార్, పిసిని హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

థర్మల్ పవర్ ప్లాంట్‌తో యువతకు ఉపాధి

సరుబుజ్జిలి: మండల పరిసర ప్రాంతాల్లో సుమారు 20 వేల కోట్ల రూపాయలతో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు జరిగితే యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. వెన్నెలవలస గిరిజన గ్రామంలో ఎంపీడీవో మురళీమోహన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాఖల వారీగా గిరిజన సమస్యలపై సమీక్ష నిర్వహిస్తూ.. గృహ నిర్మాణ, విద్యుత్ శాఖ ఏఈలతో పాటు వీఆర్‌వో, గ్రామ పంచాయతీ కార్యదర్శి సచివాలయ ఉద్యోగుల నివేదికల తప్పులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరుబుజ్జిలి, చిగురువలస, బూర్జ మండలం అన్నంపేట పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వేయి ఎకరాలను సమకూర్చితే ఈ ప్రాంతంలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి 40 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించవచ్చన్నారు. బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో గీత, సూపర్‌వైజర్ రత్నాంజలి.. వెన్నెలవలస చర్చి వద్ద ఏర్పాటు చేసిన పోషకాహార వంటకాలను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ ఎల్.మధుసూదన్, టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం కలెక్టరేట్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక కెల్ల వీధిలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. మున్సిపల్ అధికారుల పనితీరు, వారి రాకపోకలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారి సుధీర్‌కుమార్, పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షణాధికారి బి.గణేష్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● అలాగే విజయవాడ వరద బాధితులకు సహాయార్థం జిల్లా ఉద్యానవనశాఖ ఉద్యోగులు, సిబ్బంది, రైతులు, రైతు సంఘాలతో కలిసి భారీ సహాయం చేయడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. నాలుగు వాహనాల్లో బియ్యం, వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు, అరటి గెలలు, ఉల్లిపాయలు నిత్యావసర వస్తువులు పంపించారు. ఈ వాహనాలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అధికారులు కె.శ్రీరామ్మూర్తి, ఎం.అనూష, బి.అయింతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల తరలింపు సరికాదు

ఆమదాలవలస: పని సర్దుబాటు పేరు తో ఉపాధ్యాయుల త రలింపు సరికాదని చీ మలవలస సర్పంచ్ ఎస్.చెల్లంనాయుడు, ఎస్ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో పాఠశాల వద్ద వారంతా అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇక్కడ మొత్తం 63 మంది విద్యార్థులు ఉన్నారని, ఏడుగురు ఉపాధ్యాయులు ఉండేవారని, వీరిలో ఒకరు ఉద్యోగ విరమణ చేశారన్నారు. మిగిలిన ఆరుగురు ఉపాధ్యాయుల్లో నలుగురిని పని సర్దుబాటు పేరుతో ఇతర పాఠశాలలకు బదిలీ చేయడం అన్యాయమన్నారు. మిగిలిన ఇద్దరిలో ఒకరు మెడికల్ లీవ్‌పై ఉన్నారన్నారు. ఉన్న ఒక్క టీచర్‌తో తమ పిల్లల చదువు ఎలా సాగుతుందని మండిపడ్డారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న ఎంఈవో-2 లింగరాజు నిలదీశారు. తక్షణమే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులు తరగతులను బహిష్కరిస్తూ ఇళ్లకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొడ్డేపల్లి వైకుంఠరావు, అన్నెపు రమణమూర్తి, నీలయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం


మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మట్టి వినాయక విగ్రహాలనే పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని అమ్మ దేవస్థానం నిర్మాణకర్త సనపల శ్రావణ్‌కుమార్ అన్నారు. చీమలవలస, కొత్తవలస, తొగరాం, నిమ్మతొర్లాడ, కట్యాచార్యులపేట, జీకే వలస, కొరపాం, గుత్తావల్లి గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. తొగారం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలు అందించారు. పట్టణంలోని వన్‌వే జంక్షన్‌లో మట్టి విగ్రహాలను శ్రావణ్‌కుమార్ తండ్రి కృష్ణారావు ఆధ్వర్యంలో దేవస్థానం కమిటీ సభ్యులు పంపిణీ చేశారు.

జీవో 115ను తక్షణం రద్దు చేయాలి

అరసవల్లి: జీవో నెం.115ను తక్షణమే రద్దు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం ఆసుపత్రి ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. పదిహేనేళ్లుగా రెగ్యులర్ నోటిఫికేషన్ విడుదల చేయలేదని, ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నవారిని రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ప్రగతికి ఉద్యోగులే రథసారథులు

అరసవల్లి: ఆర్టీసీని పూర్వ వైభవం దిశగా నడిపించే బాధ్యత అధికారులతో పాటు ప్రతీ ఉద్యోగిపై ఉందని, ఆర్టీసీ ప్రగతి రథచక్రానికి సారథులు కిందిస్థాయి ఉద్యోగులేనని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శ్రీకాకుళం నుంచి విజయనగరానికి నూతన బస్సు సర్వీసును ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నదీ తీరం పరిశీలన

శ్రీకాకుళం రూరల్: మండలంలోని వంశధార, నాగావళి నదీ తీర ప్రాంతాల్లో ముంపు ప్రభావిత ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులతో కలిసి తహసీల్దార్ ఎస్.గణపతిరావు నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. పొన్నాం గ్రామ తీర ప్రాంతం కోతకు గురైనట్టు గుర్తిస్తూ కలెక్టర్‌కు నివేదించారు.

ఆ వెంచర్‌కు అనుమతులు లేవు

కంచిలి: భోగాబెణి పంచాయతీ పరిధి మహాల్పాడా గ్రామంలో వేసిన లే-అవుట్‌కు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ వై.జయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కీంలు పేరిట ప్రజలకు టోకరా వేసేందుకు వెలసిన ఈ వెంచర్‌లో ప్లాట్లు క్రయ విక్రయాలు జరిపితే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ ప్లాట్స్ కొంతమేర డీ-పట్టా భూముల్లో వేసినట్టు గుర్తించామని, సదరు వెంచర్‌కు సంబంధించి క్రయ విక్రయాలు చేపట్టొద్దన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు రేపు

శ్రీకాకుళం స్పోర్ట్స్: స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో ఈ నెల 8వ తేదీన సౌత్‌జోన్ జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి శుక్రవారం తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణకు టెన్త్ మార్కుల మెమోతో హాజరుకావాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 14, 15, 16 తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర ఎంపికల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులంతా ఈ నెల 8వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బూర్జ: కొల్లివలస, కేకే రాజపురంలో ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. గోదాంల్లో నిల్వలు, రికార్డుల్లోని వివరాలతో సరి చూశారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నమూనాలు సేకరించి రీజనల్ కోడింగ్ సెంటర్ (విశాఖ) పంపించారు. గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో విజిలెన్స్ ఎస్పీ


ప్రసాదం, చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మంలోని కూర్మధుని విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ప్రసాదాన్ని, చిత్ర పటాన్ని ఆలయ ఈవో గురునాథరావు అందజేశారు. ప్రధాన అర్చకులు సీతారామ నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

మహిళల ఔదార్యం ఆదర్శనీయం

అరసవల్లి: జిల్లా పొదుపు సంఘాల మహిళల ఔదార్యం ఆదర్శనీయమని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.10లక్షల చెక్‌ను డీఆర్డీఏ అధికారులు అచ్చెన్నాయుడు సమక్షంలో ముఖ్యమంత్రికి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ బాధితలను ఆదుకోవడానికి మహిళలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

అక్రమాలపై డీఎల్‌పీవో విచారణ

కంచిలి: మండంలోని ఎంఎస్ పల్లి పంచాయతీలో అక్రమాలపై డీఎల్‌పీవో ఐవీ రమణ శుక్రవారం విచారణ చేపట్టారు. నిధులు దుర్వినియోగం చేసినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. ఏవో శ్రీనివాసరావు గ్రామస్థులు పాల్గొన్నారు.

జపనీస్ భాషపై శిక్షణతో ఉపాధి

శ్రీకాకుళం కలెక్టరేట్: జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగం చేయడానికి ఆసక్తి గల అభ్యర్థులకు జపనీష్ భాషలో శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99888 53335, 7780167645 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ఆమదాలవలస: పురపాలక సంఘం ఆరో వార్డు పరిధిలోని కాళింగ మన్నయ్యపేటలోని చొక్కాకుల బంద ఆక్రమణలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హనుమంతు వెంకట సత్యనారాయణ, వీఆర్‌వోలు కె.చంద్రరావు, గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.